క్లుప్తంగా

వీరజవాన్లకు ఘన నివాళి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పుల్వామా ఉగ్రదాడిలో అమరులైన వీర జవాన్లకు ఘన నివాళులర్పించినట్టు సన్‌ఫ్లవర్ స్కూల్ ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ ఆర్.నాగలక్ష్మి, రమేష్ తెలిపారు. లంబాడీపేటలోని సన్‌ఫ్లవర్ స్కూల్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో అమరులైన వీరజవాన్ల చిత్రపటాలకు నివాళులర్పించారు. దేశం కోసం వీరమరణం పొందిన జవాన్ల గురించి విద్యార్థులకు వివరించడంతో పాటు మన జవాన్లు దేశం కోసం చేస్తున్న ప్రాణత్యాగాలను చిన్నారులకు వివరించామన్నారు.

ఉపవాస దీక్షలు ప్రారంభం



పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): విభూది బుధవారంను పురస్కరించుకుని పెజ్జోనిపేట ఆర్సీఎం చర్చిలో ఫాదర్ జేమ్స్ సమక్షంలో పలువురు భక్తులు ఉపవాస దీక్షలను స్వీకరించారు. 40 రోజుల పాటు దీక్షాధారులు ఈ ఉపవాస దీక్షలను నిష్ఠతో చేస్తారని ఫాదర్ జేమ్స్ తెలిపారు. తొలి రోజు సుమారు 150 మంది ఈ దీక్షలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. దీక్షలు తీసుకున్న భక్తులు ఒంటి పూట భోజనం చేసి ఉదయం, సాయంత్రం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సహాయక గురువులు చరణ్, మ్యాథ్యూస్, బాలరాజు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వివాహిత అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జక్కంపూడి వైఎస్సార్ కాలనీకి చెందిన వీర్ని దుర్గాప్రసాద్, మణిపూర్ణ మహాలక్ష్మి భార్యభర్తలు. దుర్గాప్రసాద్ నగరంలోని బాలాజీ సిల్వర్‌లో అకౌంటెంట్‌గా పని చేస్తుంటాడు. 13వ తేదీ మహాలక్ష్మి తమ డ్వాక్రా గ్రూపు సభ్యులతో కలిసి వైఎస్సార్ కాలనీలోని బ్యాంక్‌కు లోన్ కోసం వెళ్లారు. భవానీపురంలోని సచివాలయానికి వెళ్లి స్టాంప్ వేయించుకుని వస్తానని చెప్పి బయటకు వెళ్లిన మహాలక్ష్మి కనిపించకపోవడంతో భర్త ఆందోళన చెందాడు. మహాలక్ష్మి ఫోన్‌కు ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

మహిళపై దౌర్జన్యం చేసిన వారిపై కేసు నమోదు

పెనమలూరు: మహిళపై దౌర్జన్యం చేసిన పలువురు వ్యక్తులపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం పెనమలూరులో గ్రామంలో జి.పద్మజ గ్రూప్‌హౌస్‌లో నివాసం ఉంటుంది. అదే గ్రూప్‌హౌస్‌లో ఉంటున్న చందు రాజేశ్వరరావు, రూప, జగదీష్‌తో పాటు మరి కొందరు వ్యక్తులు పాత గొడవల కారణంగా పద్మజ, ఆమె కుటుంబ సభ్యులపై దౌర్జన్యం చేశారు. ఈ ఘటనపై బాధితురాలు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని సీతారామపురం కొత్త వెంకటేశ్వరస్వామి ఆలయం ఎదురువీధిలో ఈనెల 7వ తేదీన నడిరోడ్డుపై హత్యాయత్నానికి గురైన గిద్దా సత్యశ్రీ(36) విజయవాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు ఎస్ఐ ఎం.సూర్యభగవాన్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు..వారంరోజులుగా విజయవాడలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సత్యశ్రీ ఆరోగ్యం విషమించడంతో ఆమె మృతిచెందినట్లు ఆయన వివరించారు. ఆమెపై హత్యాయత్నానికి పాల్పడిన ముద్దాయి సయ్యద్ జాన్‌సైదాను ఈనెల 13వ తేదీన అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపిన విషయం విదితమే.

12 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

కంకిపాడు: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని కంకిపాడు పోలీసులు మంగళవారం అర్ధరాత్రి స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ డి.సందీప్ తెలిపిన కథనం మేరకు... పునాదిపాడు ఫ్లై ఓవర్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఓ వ్యాన్‌లో బియ్యం గుర్తించారు. వాటిని పరిశీలించగా రేషన్ బియ్యంగా తేలింది. దీంతో వాహనంలో తరలిస్తున్న 12 క్వింటాళ్ల రేషన్ బియ్యం, వ్యాన్‌ను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పౌరసరఫరాల శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు.

తుదిదశలో అమ్మవారి రంగుల ఉత్సవం

జగ్గయ్యపేట: పెనుగంచిప్రోలులో గోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారుతో పాటు సహదేవతల విగ్రహాలకు రంగులు దిద్దే ప్రక్రియ తుదిదశకు చేరుకుంది. ఈనెల ఒకటో తేదీన అమ్మవారితోపాటు సహదేవతల విగ్రహాలు రంగుల మహోత్సవానికి జగ్గయ్యపేటకు తీసుకువచ్చారు. పట్టణంలోని దస్తావేజుల సెంటరులోని మంటపంలో ఆచారం ప్రకారం గాజర్ల వంశీయులు రంగులు దిద్దుతున్నారు. మూలవిరాట్ తిరుపతమ్మ, గోపయ్య విగ్రహాలతో పాటు ఉత్సవ విగ్రహాలు తిరుపతమ్మ, గోపయ్యలతోపాటు మల్లయ్య, చంద్రమ్మ, మద్దిరావమ్మ, వినుకొండ అంకమ్మ, ఉన్నవూరు అంకమ్మ విగ్రహాలకు రంగులు దిద్దటం పూర్తయింది.

పారదర్శకంగా సంక్షేమ పథకాలు

- చంద్రబాబు, పవన్‌ను నమ్ముకుంటే అధోగతే
- వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆసిఫ్
- 47వ డివిజన్‌లో విస్తృత పర్యటన



ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఆసిఫ్, మేయర్ భాగ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ నేతలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పారదర్శక పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందజేస్తోందని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ షేక్ ఆసిఫ్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 47వ డివిజన్ కార్పొరేటర్ గోదావరి గంగ ఆధ్వర్యంలో ఆయన బుధవారం నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి డివిజన్ పరిధిలోని టేనర్‌పేటలో గల థామస్ పాఠశాల నుంచి పర్యటన ప్రారంభించి ఇంటింటికీ తిరిగారు. అపరిష్కృత సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నదీ లేనిదీ ఆరా తీశారు. పథకాలు అందని పక్షంలో ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. వారు చెప్పే సమస్యలను ఆలకించి పథకాల ద్వారా లబ్ధి పొందేందుకు ఆటంకంగా ఉన్న సాంకేతిక కారణాలపై సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. చిన్న చిన్న సమస్యలు ఉంటే వాటిని సరిదిద్ది మళ్లీ దరఖాస్తు చేయించాలని సూచించారు. అర్హత ఉన్న చివరి వ్యక్తి వరకు సంక్షేమ పథకాలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల వలన మునుపెన్నడూ లేని విధంగా పేదరికం తగ్గిందన్నారు.

దాబుసరి బాబు, అవగాహన లేని పవన్

పద్నాలుగేళ్లు ముఖ్యమంత్రిగా పని చేశానని డాబుసరి మాటలు చెప్పుకునే చంద్రబాబు, పార్టీ పెట్టి పదేళ్లయినా రాజకీయ అవగాహన లేని పవన్ కల్యాణ్ చెప్పే అబద్ధాలు వింటే అధోగతిపాలేనని ఆసిఫ్ అన్నారు. వారిద్దరికీ ఎల్లో మీడియా తోడయి రోత రాతలను అచ్చేసి ప్రజలను మభ్యపెట్టేందుకు యత్నిస్తోందని, వాటిని ప్రజలు విశ్వసించటం లేదని చెప్పారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చెప్పాడంటే చేస్తాడంతే అన్న నమ్మకం ప్రజల మనసుల్లో నాటుకుపోయిందని అన్నారు. విలువలతో కూడిన పాలన, విశ్వసనీయతకు ప్రతీకగా నిలిచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. చంద్రబాబు పాలనలో అన్నీ స్కాములేనని, సీఎం జగనన్న పాలనలో అన్నీ స్కీములేనని, అదే వారిద్దరి మధ్య ఉన్న తేడా అని తెలిపారు.

నగరాభివృద్ధి సీఎం జగనన్నతోనే సాధ్యం : మేయర్

నగర అభివృద్ధి సీఎం జగనన్నతోనే సాధ్యమయిందని, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించుకుని మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుంటే నగరం పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందుతుందని మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. చంద్రబాబు పాలనకు జగనన్న పాలనకు మధ్య వ్యత్యాసాన్ని బేరీజు వేసుకుని చూడాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గోదావరి బాబు, కామ్మళ్ల జోజి, కూరాకుల నాగ, దేరంగుల రమణ, శీరం వెంకట్రావు, మజ్జి శ్రీనివాసరావు రెడపంగు క్రాంతి, కె.కాళేశ్వరరాజు, సోమిశెట్టి వెంకటేష్, నన్నం దుర్గ, ఇ.విజయలక్ష్మి, గాలి దుర్గాప్రసాద్(జీడీ), కె.ఆంజనేయులు, పిళ్లా సూరిబాబు(జగ్గు), కామ్మళ్ల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

38వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం 38వ డివిజన్ పరిధిలో నాలుగు స్తంభాల సెంటర్‌లో గల ఈటె వారి వీధిలో రోడ్డు, సైడు డ్రెయిన్ల నిర్మాణ పనులకు స్థానిక కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా బుధవారం కొబ్బరికాయ కొట్టి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌లో ఎక్కువ భాగం ఉన్న కొండ ప్రాంతంలో మెట్లు, సైడ్ డ్రెయిన్ల గురించి గత ప్రభుత్వం పట్టించుకోక పోవడం వలన కొండ ప్రాంతవాసులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నగరాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించటం, అందుకు అనుగుణంగా స్థానిక ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు చొరవ తీసుకుని నిధులు మంజూరు చేయించటంతో డివిజన్‌లోని కొండ ప్రాంతంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు. అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఈటె వారి వీధిలో రోడ్డు, డ్రెయిన్ నిర్మాణ పనులకు రూ.5లక్షలు మంజూరు కావడంతో ఈ రోజు పనులు ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి షేక్ హయాత్ షరీఫ్, మాజీ కార్పొరేటర్ మంటి కోటేశ్వరరావు, గోమతోటి వినోద్ పాల్, కరీం, మంటి రాము, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

దామోదరం సంజీవయ్యకు ఘన నివాళి

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ద్వితీయ ముఖ్యమంత్రిగా దామోదరం సంజీవయ్య అందించిన సేవలు ఎనలేనివని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. నగరంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో బుధవారం దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుహాసిని మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రిగా పని చేసి బడుగు బలహీన వర్గాలకు ఆయన చేసిన సేవలు ఎనలేనివన్నారు. వృద్ధులకు పెన్షన్లు, దేశంలోనే బాలికలకు తొలిసారిగా సాంకేతిక విద్యను అందుబాటులోకి తెచ్చారని, దాంతో పాటు చర్మ కారులకు లిడ్ క్యాప్ సంస్థ ఏర్పాటు, పారిశ్రామిక అభివృద్ధి దిశగా ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ అభివృద్ధి కార్పొరేషన్ ఏర్పాటు వంటి విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ అమృత, డెప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఇందుమతి, డీపీఎంఓ డాక్టర్ నవీన్, డాక్టర్ పద్మావతి, డాక్టర్ కార్తీక్, డాక్టర్ విద్యాసాగర్ , డెప్యూటీ డెమో ప్రభాకరరెడ్డి, ప్రసూనాంబ తదితరులు పాల్గొన్నారు.



దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న డీఎంహెచ్ఓ సుహాసిని



దామోదరం సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వీఎంసీ సీఈ ప్రభాకర్

చిరస్మరణీయుడు దామోదరం సంజీవయ్య

పటమట(విజయవాడతూర్పు): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు రెండో ముఖ్యమంత్రిగా, తొలి దళిత ముఖ్యమంత్రిగా ప్రజలకు సేవ చేసిన దామోదరం సంజీవయ్య చిరస్మరణీయుడని నగర పాలక సంస్థ చీఫ్ ఇంజినీర్ ప్రభాకర్ అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలో బుధవారం సంజీవయ్య జయంతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రభాకర్ సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంజీవయ్య 1961లో విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయానికి శంకుస్థాపన చేశారన్నారు. కార్యక్రమంలో మేనేజర్ బి.శ్రీనివాసరావుతో పాటు కార్పొరేషన్ సిబ్బంది అందరూ పాల్గొని ఘన నివాళులు అర్పించారు

సంజీవయ్య సేవలు చిరస్మరణీయం

విజయవాడస్పోర్ట్స్: దివంగత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య సేవలు చిరస్మరణీయమని డీసీపీ కృష్ణకాంత్ పాటిల్ అన్నారు. సంజీవయ్య జయంతి వేడుకలు బుధవారం పోలీస్ కమిషనరేట్‌లో జరిగాయి. కార్యక్రమంలో డీసీపీ కృష్ణకాంత్ పాల్గొని సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉమ్మడి ఆంధ్రా అభివృద్ధికి సంజీవయ్య నిస్వార్థంగా సేవలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఏడీసీపీ ఎం.కృష్ణమూర్తినాయుడు, ఏసీపీ డాక్టర్ కె.స్రవంతిరాయ్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలను నిర్మూలిస్తేనే ఉత్తమ సమాజం

కృష్ణలంక(విజయవాడతూర్పు): మత్తు పదార్థాలను నిర్మూలించి ఉత్తమ సమాజాన్ని నిర్మించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జమాఅతె ఇస్లామి హింద్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు జాహెదా బేగం అన్నారు. కృష్ణలంక, భ్రమరాంబపురంలోని ఐతా రాములు కొట్టు సెంటర్‌లో కౌసర్ మస్జిద్ వద్ద బుధవారం మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాహెదా బేగం మాట్లాడుతూ నేటి యువత మత్తు పదార్థాలకు బానిసలై విలువైన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాలను నిర్మూలిద్దాం.. ఉత్తమ సమాజాన్ని నిర్మిద్దాం అనే నినాదంతో ఈ నెల 8 నుంచి 18వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో జమాఅతె ఇస్లామి హింద్ రాష్ట్ర సహాయ కార్యదర్శి షహనాజ్ సుల్తానా, విజయవాడ తూర్పు మహిళా అధ్యక్షురాలు నగీనా అఖ్తర్, తాహెరా, ఖాలిదా, సాదిఖా, రుక్సానా తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న జమాఅతె ఇస్లామి హింద్ సభ్యులు

మాతృభాష గొప్పతనం తెలుసుకోవాలి

గుణదల (విజయవాడ తూర్పు): మాతృభాషను కన్నతల్లిలా ప్రేమించాలని, దేశ భాషలందు తెలుగు లెస్స అనే సత్యాన్ని గుర్తించాలని ప్రముఖ రచయిత పూలబాల వెంకట్ అన్నారు. ఆంధ్ర లయోల కళాశాలలో మాతృభాషా దినోత్సవ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ తాను ఆరు భాషల్లో 60 పుస్తకాలు రచించినా తెలుగు భాష పైనే మక్కువ ఎక్కువన్నారు. తెలుగు భాషలో ఉన్న సౌందర్యం, మాధుర్యం ప్రపంచంలో మరే భాషకూ లేదని అభిప్రాయపడ్డారు. అచ్చులు, హల్లులు, నుడికారాలతో స్పష్టమైన శబ్దంతో పలికే భాష మన తెలుగేనన్నారు. తెలుగు భాషకు పూర్వ వైభవం తేవాలని కోరారు. మాతృభాష విశిష్టతను దశదిశలా వ్యాపింప చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ కిరణ్ కుమార్, తెలుగు విభాగాధిపతి కోలా శేఖర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


త్రిశక్తి పీఠంలో అక్షరాభ్యాసం



కృష్ణలంక(విజయవాడతూర్పు): బస్టాండ్ సమీపంలోని శ్రీ కాళీమాత అమ్మవారి దేవస్థానం(త్రిశక్తి పీఠం)లో శ్రీ పంచమి సందర్భంగా బుధవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులకు పలక, బలపం, పెన్ను, రబ్బరు పంపిణీ చేశారు. సుమారు 750 మంది చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం చిన్నారులకు పాలు, సేమియా, పాయసం, భక్తులకు పులిహోర, చక్ర పొంగలి ప్రసాదాలు పంపిణీ చేశారు.

కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష , కార్యదర్శులు జి.పుల్లయ్య, కె.జగదీష్‌కుమార్, ఆధ్యాత్మిక సలహాదారుడు భారతుల విజయకిరణ్, సూపరింటెండెంట్ మధుసూదనరావు, కమిటీ సభ్యులు సత్యం, విజయ్, వంశీ, రాజా, జగన్, విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● ప్రకృతి గీసిన అద్భుత చిత్రం



ఆకాశం కాన్వాస్‌పై ప్రకృతి గీసిన అద్భుత చిత్రం ఇది. కృష్ణానదిపై బుధవారం సాయంసంధ్యా సమయంలో భానుడు అస్తమిస్తూ అరుణవర్ణాన్ని పులిమినట్టు ఉంది. ఎర్రని కాంతులతో కనువిందు చేసిన ఈ దృశ్యాన్ని 'సాక్షి' తన కెమెరాలో బంధించింది.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

సప్తవాహన సేవకు ఏర్పాట్లు పూర్తి

పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): ఈ నెల 16న రథసప్తమిని పురస్కరించుకుని పెజ్జోనిపేట శ్రీ లక్ష్మీనారాయణస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ కార్యదర్శి కృష్ణ ప్రసాద్ తెలిపారు. ఆలయం ఆవరణలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విజయవాడ నగరంలో ఉన్న ఏకైక శ్రీ లక్ష్మీనారాయణ స్వామి దేవాలయం పెజ్జోనిపేటలోనే ఉందన్నారు. రథసప్తమి సందర్భంగా శుక్రవారం స్వామి వారికి సప్తవాహన సేవ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. స్వామి వారిని ఉదయం 7 గంటలకు సూర్యప్రభ వాహనం, 8.30 గంటలకు శేష వాహనం, 9.30కు గరుడ వాహనం, 10.30కు ఆంజనేయ వాహనం, సాయంత్రం 4 గంటలకు అశ్వవాహనం, 5.30కు సర్వభూపాల వాహనం, 6.30కు చంద్రప్రభ వాహనంలో ఊరేగిస్తామన్నారు. ఒకే రోజున స్వామి వారు 7 వాహనాలలో ఊరేగుతూ ప్రత్యేక అలంకరణలతో భక్తులకు దర్శనం ఇస్తారని తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వైభవంగా దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠ



శ్రీసరస్వతి అమ్మవారు



అభయాంజనేయస్వామి

పెనమలూరు: గంగూరు గ్రామ పరిధి విజయ్ స్పిన్నింగ్ మిల్ ప్రాంగణంలో బుధవారం శ్రీ విద్యా సరస్వతి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా జరిగింది. వసంత పంచమి సందర్భంగా నూతనంగా నిర్మాణం చేసిన శ్రీ విద్యా సరస్వతి అమ్మవారి ఆలయంలో బుధవారం ఉదయం 10.15 గంటలకు శ్రీ సరస్వతి అమ్మవారి విగ్రహాన్ని, ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. దేవతి హోమం, పూర్ణాహుతి, శాంతికల్యాణం పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం 12 గంటలకు భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

కొండపావులూరులో విగ్రహ ప్రతిష్ఠ

గన్నవరంరూరల్: మండలంలోని కొండపావులూరులో కొండపై ఉన్న శ్రీ దత్త వెంకటేశ్వర అభయాంజనేయస్వామి ఆలయంలో బుధవారం కార్యసిద్ధి అభయాంజనేయస్వామి ఏకశిల విగ్రహ ప్రతిష్ఠ భక్తుల కోలాహలం మధ్య వైభవంగా జరిగింది. శ్రీ దత్త విజయానంద తీర్థ స్వామీజీ చేతుల మీదుగా ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం యంత్ర స్థాపన, శ్రీ చక్రార్చన, అనుగ్రహ భాషణం అనంతరం అభిషేకం, కుంభాభిషేకం జరిగాయి. వందలాది మంది భక్తులకు అన్నసంతర్పణ చేశారు. ఆలయ భక్త బృందం భక్తుల ఏర్పాట్లు పర్యవేక్షించింది.



ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న గ్రామస్తులు

అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ లభించాలని ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఏపీ ఫైబర్ నెట్ కార్పొరేషన్ చైర్మన్, బాబా మందిరం గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి తెలిపారు. వసంత పంచమి పురస్కరించుకుని ముత్యాలంపాడు షిరిడీ సాయిబాబా మందిరంలో బుధవారం శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ మండలి ఆధ్వర్యాన శ్రీ లక్ష్మి అష్టోత్తర పారాయణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక కళ్యాణార్థం పారాయణం నిర్వహిస్తున్న పారాయణమండలి కన్వీనర్ మందలపర్తి సత్యశ్రీహరిని అభినందించారు. ఉదయం 9 గంటల నుంచి 108 పర్యాయములు పారాయణం చేశారు. భక్తులకు పసుపు, కుంకుమ, గాజులు, చలిమిడి క్షీరాన్న ప్రసాదము, రవికెల వస్త్రము అందజేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమాలను పారాయణమండలి కన్వీనర్ మందలపర్తి సత్యశ్రీహరి పర్యవేక్షించారు.

ఆలయ అభివృద్ధికి ప్రణాళికలు

తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న వాల్మీకోద్భవ వెంకటేశ్వర స్వామివారి ఆలయ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చైర్మన్ భరద్వాజ్ తెలిపారు. ఆలయ ధర్మకర్త పాలక మండలి తొలి సమావేశం ఆయన అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండ చుట్టూ గిరిప్రదక్షిణ కోసం పనులు పూర్తవుతున్నాయన్నారు. కోనేరు అభివృద్ధి, ఆర్చి గేటు నిర్మాణాలు, భక్తుల సౌకర్యార్థం లిఫ్టు, స్వామి వారి ప్రచారానికి దాతల సహకారంతో రథం ఏర్పాటు తదితర అభివృద్ధి పనులతోపాటు సిబ్బంది వేతనాల పెంపునకు తగిన చర్యలు చేపడుతున్నట్లు వివరించారు.

శభాష్ వర్ధిని

విజయవాడస్పోర్ట్స్: ఆడుదాం ఆంధ్రా మహిళల క్రికెట్ పోటీల్లో అత్యుత్తమ క్రీడా నైపుణ్యం ప్రదర్శించి చెన్నై సూపర్ కింగ్స్(సీఎస్‌కే) టాలెంటెడ్ ప్లేయర్‌గా సెలక్ట్ అయిన విజయవాడ క్రీడాకారిణి కె.వై.ఎం.విష్ణువర్ధినిని నలంద డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ ఎం.అనురాధ బుధవారం కాలేజీ ప్రాంగణంలో అభినందించారు. ఆడుదాం ఆంధ్రా క్రికెట్ రాష్ట్ర పోటీలకు తమ కళాశాల నుంచి వర్ధినితో పాటు మరో విద్యార్థిని పూజిత ఎన్టీఆర్ జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించినట్లు చెప్పారు. బీకాం మొదటి సంవత్సరం చదువుతున్న వర్ధిని రాష్ట్ర జట్టుకు విన్నర్ ట్రోఫీని అందించడంలో కీలకంగా వ్యవహరించడం సంతోషంగా ఉందన్నారు. టాలెంట్ హంట్‌లో భాగంగా సీఎస్‌కే నిర్ణేతల టాలెంటెడ్ జాబితాలో పేరు సాధించి, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులు పొందడం అభినందనీయమన్నారు. క్రీడా నైపుణ్యాలను మెరుగుపర్చుకుని వర్ధిని రానున్న రోజుల్లో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.



విష్ణువర్ధినిని అభినందిస్తున్న నలంద డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ అనురాధ

● **పెనుగంచిప్రోలు:** గ్రామంలో ఉన్న శ్రీతిరుపతమ్మవారి కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని పీటలపై కూర్చునే దంపతులను బుధవారం ఆలయ ప్రాంగణంలో లాటరీ ద్వారా ఎంపిక చేశారు. ఫిబ్రవరి 23న నిర్వహించే కల్యాణంలో శ్రీతిరుపతమ్మవారి తరఫున ఆమె ఇంటిపేరు గల కొల్లా రఘు రామయ్య దంపతులు ఒక్కరే దరఖాస్తు చేసుకోగా వారు ఎంపికయ్యారు.

రోటరీ డిస్ట్రిక్ట్‌కు రూ.1.98 కోట్ల సీఎస్ఆర్ ఫండ్స్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ (3020) గవర్నర్ రావూరి సుబ్బారావు (దత్త) ఆధ్వర్యంలో విజయవాడలోని రోటరీ సంస్థలకు రూ.1.98 కోట్ల సీఎస్ఆర్ ఫండ్స్ రావటం అభినందనీయమని రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ ఈస్ట్ అధ్యక్షుడు బాయన బాబూజీ (బాబ్జీ) ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంత పెద్ద మొత్తం సీఎస్ఆర్ నుంచి రావటం గొప్ప విషయమని పేర్కొన్నారు. ఆ నిధులతో రోటరీ డిస్ట్రిక్ట్ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో విస్తృతంగా సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించేందుకు అవకాశం కలిగిందని తెలిపారు. రోటరీ ఈస్ట్ పరిధిలోనూ నిర్విరామంగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని వివరించారు.